సాక్షి
పశ్చిమగోదావరి
శనివారం । 17 । జూన్ । 2023



వృద్ధులకు కంటి వెలుగు
పశ్చిమగోదావరి జిల్లాలో కంటి వెలుగు పథకం కింద వృద్ధులకు మూడో విడత కంటి పరీక్షలు ముమ్మరంగా చేస్తున్నారు.
8లో ▸



కిడ్నాప్ కేసును ఛేదించి..
ఏలూరు జీజీహెచ్ వద్ద ఓ వ్యక్తిని కిడ్నాప్ చేసిన కేసును పోలీసులు ఛేదించారు. కిడ్నాప్‌నకు యత్నించిన వ్యక్తులను అరెస్ట్ చేశారు.
8లో ▸



పెళ్లిళ్లకు విరామం
వివాహాది శుభకార్యాల ముహూర్తాలకు రెండు నెలల పాటు బ్రేక్ పడింది. ఈనెల 19 నుంచి ఆషాఢ మాసం ప్రారంభం కానుంది.
8లో ▸

న్యూస్‌రీల్

డీఎస్పీ కార్యాలయం ప్రారంభం



కార్యాలయంలో పూజలు చేస్తున్న ఎస్పీ

తాడేపల్లిగూడెం: పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన డీఎస్పీ కార్యాలయాన్ని జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్ శుక్రవారం ప్రారంభించారు. ఇటీవల తాడేపల్లిగూడేనికి డీఎస్పీ కార్యాలయం మంజూరు కాగా సుబ్బారావు పేటలోని స్కేటింగ్ పార్కు సమీపంలో ఉన్న భవనంలో ఏర్పాటుచేశారు. ఎస్పీ రవిప్రకాష్ శాస్త్రోక్తంగా పూజలు చేసి కార్యాలయాన్ని ప్రారంభించారు. డీఎస్పీ శరత్‌రాజ్‌కుమార్, రూరల్ సీఐ సత్యనారాయణమూర్తి, గూడెం పట్టణ, రూరల్, గణపవరం ఎస్సైలు పాల్గొన్నారు.

నేటినుంచి చెస్ పోటీలు

సాక్షి, భీమవరం: జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం జిల్లాస్థాయి అండర్–9 ఓపెన్ అండ్ గరల్స్ చెస్ పోటీలు భీమవరం అనసూయ చెస్ అకాడమీలో నిర్వహించనున్నట్టు చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాదాసు కిషోర్ తెలిపారు. ఈ పోటీల్లో విజేతలు ఈనెల 23 నుంచి విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. అలాగే ఈనెల 18న జిల్లా అండర్–7 ఓపెన్ అండ్ గరల్స్, బ్లిట్జ్ చెస్ పోటీలను అనసూయ చెస్ అకాడమీలో నిర్వహిస్తామని, విజేతలు విజయనగరంలో ఈనెల 26 నుంచి జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. మరిన్ని వివరాలకు సెల్ 90632 24466లో సంప్రదించాలని కోరారు.

18న టైలరింగ్ శిక్షణ ప్రారంభం

పాలకొల్లు అర్బన్: శివదేవునిచిక్కాలలో శ్రీ రాఘవేంద్ర చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈనెల 18న సాయంత్రం 4 గంటలకు మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణా శిబిరాన్ని కలెక్టర్ పి.ప్రశాంతి చేతులమీదుగా ప్రారంభించనున్నట్లు ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు నిమ్మల అనంత రామారావు ఓ ప్రకటనలో తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ వారిచే నిర్వహించే శిక్షణకు ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న మహిళలంతా హాజరుకావాలని సూచించారు. ప్రారంభం కార్యక్రమంలో హాజరైన వారికి మాత్రమే ఉచిత కుట్టుమెషీన్, మోటార్ ఇచ్చేందుకు పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. మరిన్ని వివరాలకు శివప్రసాద్, సెల్ 7207575616 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

జాగ్రత్తగా బస్సులు నడపాలి



మాట్లాడుతున్న జిల్లా రవాణాధికారి

భీమవరం(ప్రకాశం చౌక్): బస్సులు నడిపే టప్పుడు జాగ్రత్తలు పాటించాలని పాఠశాల, కళాశాల బస్సు డ్రైవర్లకు జిల్లా రవాణాధికారి టి.ఉమా మహేశ్వరరావు సూచించారు. స్థానిక ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో శుక్రవారం బస్సు డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్సుల నిర్వహణలో యాజమాన్యాలు శ్రద్ధ వహించాలన్నారు. డ్రైవర్ల వయసు 60 ఏళ్లు దాటకూడదని, కనీసం ఐదేళ్ల అనుభవం ఉండాలన్నారు. సుమారు 300 మంది డ్రైవర్లకు అవగాహన కల్పించారు. డాక్టర్ పరశురాం, డాక్టర్ మురళీ కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రాధాన్యంగా..

చివరి వరకు అండగా..
- ముగిసిన దాళ్వా ధాన్యం సేకరణ
- ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 8.53 లక్షల టన్నుల కొనుగోళ్లు
- 21 రోజుల్లోపు రైతుల ఖాతాలకు సొమ్ములు
- రూ.1,684 కోట్ల మేర చెల్లింపులు



ధాన్యం పట్టుబడి (ఫైల్)

సాక్షి ప్రతినిధి,ఏలూరు: అన్నదాతల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది. విత్తు నుంచి పంటల విక్రయం వరకూ అన్నింటా అండగా నిలుస్తోంది. దళారుల చేతుల్లో రైతులు మోసపోకుండా ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను ప్రభుత్వమే చేపట్టింది. ఎప్పటికప్పుడు ధాన్యం సొమ్ములు జమచేస్తూ వ్యవసాయాన్ని పండుగ చేస్తోంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా దాళ్వా ధాన్యం సేకరణ ప్రక్రియ గురువారంతో ముగిసింది. జిల్లావ్యాప్తంగా ఏ ఒక్క రైతుకు ఇబ్బంది కలగకుండా ధాన్యం సేకరణలో జిల్లా అధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రకృతి వైపరీత్యాలు, గోనె సంచుల కొరత తదితర సమస్యలను అధిగమిస్తూ ప్రణాళికాబద్ధంగా ధాన్యం కొనుగోలు చేశారు.

ఎన్నడూ లేనివిధంగా..
గత ప్రభుత్వాలు చేయని సాహసోపేతమైన నిర్ణయాన్ని జగనన్న ప్రభుత్వం తీసుకుంది. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటూ రైతు సంక్షేమమే ధ్యేయంగా పరిపాలన సాగిస్తూ దళారుల వద్ద మోసపోకుండా ప్రభుత్వమే నేరుగా ధాన్యం కొనుగోలుకు చర్యలు చేపట్టింది. రెండేళ్లుగా ఇదే విధానం అనుసరిస్తూ ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించి పంటలను కొనుగోళ్లు చేస్తోంది. రైతుల కళ్లాల వద్దకే అధికారులు వెళ్లి గోనె సంచులు, రవాణా వాహనాలను రైతులకు సమకూర్చి, వారి నుంచి ధాన్యాన్ని సేకరిస్తూ అండగా నిలిచింది.

ధాన్యం సేకరణ ఇలా..

ఏలూరు జిల్లా	
కొనుగోలు కేంద్రాలు	145
ధాన్యం కొనుగోళ్లు	2.16 లక్షల టన్నులు
సేకరించిన రైతులు	19,097
సొమ్ముల జమ	రూ.434 కోట్లు
పశ్చిమగోదావరి జిల్లా	
కొనుగోలు కేంద్రాలు	270
ధాన్యం కొనుగోళ్లు	6.43 లక్షల టన్నులు
సేకరించిన రైతులు	74,129
సొమ్ముల జమ	రూ.1,250 కోట్లు

ఏప్రిల్ 16 నుంచి కొనుగోళ్లు
ఏలూరు జిల్లాలో రబీ సీజన్‌కు సంబంధించి ఏప్రిల్ 16న ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను ప్రారంభించారు. ఈనెల 15 వరకు రెండు నెలలపాటు నిర్విరామంగా ధాన్యం కొనుగోలు చేశారు. జిల్లాలో వరి పండించే 22 మండలాల్లో 145 రైతు భరోసా కేంద్రాల నుంచి ధాన్యం కొనుగోలు చేశారు. 21 రోజుల్లోపే ధాన్యం సొమ్ములు రైతుల ఖాతాలకు జమచేసేలా చర్యలు తీసుకున్నారు. మరో 20 రోజుల్లో పూర్తిస్థాయిలో రైతులకు సొమ్ములు చెల్లించేందుకు జిల్లా అధికారులు చర్యలు తీసుకున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో 270 ఆర్‌బీకే కేంద్రాల ద్వారా ధాన్యం సేకరించారు. మొత్తం 6.43 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరించగా రూ.1,313 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఇప్పటివరకూ రూ.1,250 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశారు. మిగిలిన సొమ్ములు మరో 20 రోజుల్లో చెల్లించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు.

ఎప్పటికప్పుడు సొమ్ముల జమ



రెండు నెలలుగా జిల్లావ్యాప్తంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియను కొనసాగించి రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నాం. ఇప్పటివరకు రూ.434 కోట్ల ధాన్యం సొమ్ములను రైతుల ఖాతాల్లో జమచేశాం. 21 రోజుల్లోపు రైతులకు సొమ్ములు అందిస్తూ దళారుల చేతుల్లో మోసపోకుండా నిరంతరం పర్యవేక్షించాం.
– బి.లావణ్యవేణి, జాయింట్ కలెక్టర్, ఏలూరు జిల్లా

21 రోజుల్లోపే..



పశ్చిమగోదావరి జిల్లాలో 6.43 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశాం. రైతులకు 21 రోజుల్లో సొమ్ములు చెల్లిస్తూ ఎటువంటి ఇబ్బందులు లేకుండా వారి ఖాతాల్లో సొమ్ములు జమ చేస్తున్నాం. ధాన్యం కొనుగోలుపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి రైతుల వద్ద నుంచి నేరుగా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకున్నాం.
– ఎస్.రామసుందరరెడ్డి, జాయింట్ కలెక్టర్, పశ్చిమగోదావరి జిల్లా

త్వరితగతిన ఓటర్ల సమస్యల పరిష్కారం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఫామ్–6,7,8 క్లెయిమ్‌లను త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ముఖేష్‌కుమార్ మీనాకు కలెక్టర్ పి.ప్రశాంతి వివరించారు. విజయవాడ నుంచి శుక్రవారం ఈఆర్‌ఓ.నెట్, ఈవీఎం గోడౌన్లు, ఎపిక్ కార్డుల పంపిణీ, ఈపీ కేసులు, ఎస్‌ఓపీలు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భీమవరం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ పి.ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి, డీఆర్వో కె.కృష్ణవేణి అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ జిల్లాలో ఫామ్–6 క్లెయిమ్‌లకు సంబంధించి 5,800 దరఖాస్తులు రాగా 862 పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. ఫామ్–7 క్లెయిమ్‌లకు సంబంధించి 2,549 దరఖాస్తులు రాగా 241 పెండింగ్ ఉన్నాయని, ఫామ్–8 క్లెయిమ్‌లకు సంబంధించి 1,895 దరఖాస్తులు రాగా, 354 పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వీటన్నింటినీ వెంటనే పరిష్కరిస్తామని చెప్పారు. నరసాపురం సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, భీమవరం ఆర్డీఓ దాసి రాజు, ఆర్‌ఓలు, ఈఆర్‌ఓలు పాల్గొన్నారు.

● ఎండ ప్రచండం.. కర్ఫ్యూ వాతావరణం



భీమడోలు: భీమడోలు నుంచి కొవ్వూరు రహదారి



పెంటపాడు: ప్రత్తిపాడు వద్ద జాతీయ రహదారి

మాడు పగిలే ఎండలు హడలెత్తిస్తున్నాయి. జూన్ మూడో వారం వచ్చినా ఎండ తీవ్రత తగ్గకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. శుక్రవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో 43 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో బయటకు వచ్చేందుకు భయపడ్డారు. దీంతో ఉదయం 10 గంటల నుంచి రోడ్లన్నీ వెలవెలబోయాయి. అంతటా కర్ఫ్యూ వాతావరణం కనిపించింది.
– సాక్షి నెట్‌వర్క్



ఏలూరు: ఏలూరు ఫ్లైఓవర్ బ్రిడ్జిపై..

ప్రభుత్వ విద్యా రంగం బలోపేతం

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



ఇరగవరంలో జగనన్న విద్యా కానుక అందుకున్న విద్యార్థులతో మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

ఇరగవరం: దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి చేస్తున్నారని రాష్ట్ర పౌరసరఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండలంలోని ఇరగవరం, తూర్పువిప్పర్రు, ఏలేటిపాడు, రేలంగి గ్రామాల్లోని హైస్కూళ్లలో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ, పాఠశాల స్థాయిలో పదో తరగతిలో ప్రతిభ చాటిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు పురస్కారాల ప్రదానం కార్యక్రమాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు హాజరై విద్యార్థులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తణుకు నియోజకవర్గంలో పేద విద్యార్థుల చదువులపై రూ.154 కోట్లు ఖర్చు చేశామని, ఇంత పెద్దెత్తున ఏ ప్రభుత్వం చేయలేదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం కోసం శాసనసభలో 151 మంది ఎమ్మెల్యేలు తీర్మానం చేస్తే శాసనమండలిలో తెలుగుదేశం పార్టీ అడ్డుకుందని విమర్శించారు. టీడీపీ నాయకుల పిల్లల మాత్రం ఇంగ్లిష్ మీడియంలో చదువుతున్నారని, పేద విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియం వద్దా అని ప్రశ్నించారు. పేదల పిల్లలు అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా సీఎం జగన్ ఇంగ్లిష్ మీడియాన్ని ప్రవేశపెట్టారన్నారు. వారాహి యాత్రలో పవన్‌కల్యాణ్ 'నా పిల్లలను నేను చదివిస్తాను.. మీ పిల్లలను ఎవరు చదివిస్తారు' అన్న మాటలను సెల్‌లో వినిపించి మిమ్మల్ని ఎవరు చదివిస్తారు పిల్లలు అని మంత్రి కారుమూరి అడగ్గా.. అందరూ ముక్తకంఠంతో జగన్ మావయ్య చదివిస్తారు అని చెప్పారు. అనంతరం విద్యార్థులతో ఆయన ముచ్చటించి పాఠశాలల్లో వసతులు, ప్రాధాన్యతలపై ఆరా తీశారు. భావితరాల భవిష్యత్‌కు బంగారు బాటలు వేస్తున్న సీఎం జగన్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జెడ్పీటీసీ పంపన అంజిబాబు, ఎంపీపీ కొప్పిశెట్టి అలివేలు మంగతాయారు, కె.ఇల్లిందలపర్రు సొసైటీ అధ్యక్షుడు మల్లిరెడ్డి నాగార్జున, పార్టీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, ఎంఈఓ ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లాస్థాయి 'జగనన్న ఆణిముత్యాలు' పురస్కారాల ప్రదానం

సాక్షి, భీమవరం: పదో తరగతి, ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో జిల్లాస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు శనివారం జగనన్న ఆణిముత్యాలు పేరుతో ప్రోత్సాహక నగదు, పురస్కారాలు అందించనున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ శుక్రవారం తెలిపారు. భీమవరం అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రంలో ఉదయం 10 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అధ్యక్షత వహిస్తారని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు, ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, మంత్రులు దాడిశెట్టి రాజా, కారుమూరి వెంకట నాగేశ్వరరావు, కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్పీ యు.రవిప్రకాష్, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారని చెప్పారు.

పూర్తిస్థాయిలో సాగునీటి విడుదల



జిల్లాస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

కలెక్టర్ ప్రశాంతి

సాక్షి, భీమవరం: జిల్లాలో సార్వా నారుమడులకు రైతులు సన్నద్ధమవుతున్న తరుణంలో కాలువలకు నీటి విడుదలను సమన్వయం చేస్తూ పూర్తిస్థాయిలో అందించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కైగాల శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రస్తుతం నరసాపురం కాలువకు విడుదల చేస్తున్న 4 వేల క్యూసెక్కుల నీరు నారుమడులకు సరిపోవడం లేదని, నీటిపారుదల శాఖ అధికారుల సమన్వయంతో పూర్తిస్థాయిలో నీరందించాలన్నారు. ప్రస్తుత సార్వా సీజన్‌లో 2.39 లక్షల ఎకరాల్లో వరి, 150 ఎకరాల్లో అపరాలు, 1,000 ఎకరాల్లో చెరకు, సుమారు 37 ఎకరాల్లో వేరుశనగ సాగుచేయాల్సి ఉందన్నారు. 5.25 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అంచనా వేశామన్నారు. గత దాళ్వా పంటలో 74,129 మంది రైతుల నుంచి 6,43,868 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయగా రూ.1,313.72 కోట్లు చెల్లించాల్సి ఉందని, ఇప్పటివరకు రూ.1,250.67 కోట్లు చెల్లించామన్నారు. రైతులు సార్వా వరినాట్లు ఆగస్టు మొదటి వారంలోపు పూర్తిచేయాలన్నారు. మండలి అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ మురుగు కాలువల్లో గుర్రపుడెక్క తొలగింపు, పూడిక తీత పనులను సకాలంలో పూర్తిచేయాలన్నారు. కమిటీ సభ్యుడు పెన్మెత్స దుర్గాప్రసాద్‌రాజు మాట్లాడుతూ ఆక్వా సాగుకు విద్యుత్ సబ్సిడీ కొంతమంది రైతులకు అందడం లేదన్నారు. కొట్టు కుటుంబరావు మాట్లాడుతూ గునుపూడి డ్రెయిన్ పరిధిలోని నాలుగు గ్రామాల్లో బ్యాక్ వాటర్ కారణంగా వరి సాగుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. అనంతరం జరిగిన డీసీసీ, డీఎల్ఆర్‌సీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. డీఆర్వో కె.కృష్ణవేణి, జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, యూబీఐ రీజినల్ హెడ్ పి.సంగీతకుమారి, లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ ఎ.నాగేంద్ర ప్రసాద్, ఆర్‌బీఐ మేనేజర్ ఎ.నాగ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సార్వాకు సన్నద్ధం

- జిల్లాలో 2.39 లక్షల ఎకరాల్లో వరి సాగు
- రైతులకు రాయితీపై విత్తనాలు
- 53,873 టన్నుల ఎరువులు అవసరం
- నారుమడుల్లో రైతుల నిమగ్నం



తాడేపల్లిగూడెం మండలం కృష్ణాయపాలెంలో సార్వా నారుమడి

సాక్షి, భీమవరం: జిల్లాలోని 20 మండలాల్లో సార్వా వరి సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో వరి నారుమడులు పూర్తిచేశారు. మిగిలిన ప్రాంతాల్లో పొలాల్లోని ఎత్తుపల్లాలను సరిచేయడం, మెట్ట దుక్కులు చేయడం, గట్టు లంకలు వేయడం వంటి పనుల్లో నిమగ్నమయ్యారు. జిల్లాలో సుమారు 2.39 లక్షల ఎకరాల్లో సార్వా సాగు ఉంటుందని అధికారులు అంచనా వేసి ఈ మేరకు ప్రణాళికను సిద్ధం చేశారు. రైతులతో ముందస్తుగా నాట్లు వేయించి సుమారు 5.25 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి లక్ష్యంగా వ్యవసాయశాఖ ప్రణాళిక రూపొందించింది.

మేలైన రకాలివే..
కాలువలకు నీరు విడుదల చేసినందున ముందుగా నాట్లు వేసే రైతులు ఎంటీయూ 1318, కాలువ శివారు ప్రాంతాల్లోని రైతులు మధ్యకాలిక రకాలైన ఎంటీయూ 1061, ఎంటీయూ 1064, ఎంటీయూ 7029 రకాలు సాగు చేయాలని వ్యవసాయ అధికారులు సూచించారు.

10 వేల మట్టి నమూనాల సేకరణ
భూములకు అనుగుణంగా ఎరువులు వాడాల్సిన నేపథ్యంలో ముందుగా భూసార పరీక్షలు నిర్వహించి మట్టి నమూనాలను సేకరిస్తున్నారు. ప్రస్తుత పంట కాలానికి జిల్లాలో 10 వేల నమూనాలు సేకరించాలని వ్యవసాయశాఖ లక్ష్యంగా నిర్ణయించింది. రైతు భరోసా కేంద్రాల వారీగా నమూనాలు సేకరించి తాడేపల్లిగూడెంలో భూసార పరీక్షలు నిర్వహించి వాటి వివరాలను రైతులకు అందజేయనున్నారు.

రాయితీపై విత్తనాలు
సార్వా సీజన్‌కు 47,800 క్వింటాళ్ల వరి విత్తనాలు అవసరం కాగా ఇందులో ఎక్కువ శాతం రైతు వారీగా సేకరించుకోవడం పరిపాటి. అయినా రైతు భరోసా కేంద్రాల్లో 1,737 క్వింటాళ్ల విత్తనాలను కిలో రూ.5 రాయితీపై పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధం చేసింది. వరినాట్లు ఆగస్టు మొదటి వారంలో పూర్తయ్యేలా రైతులను సన్నద్ధం చేస్తున్నారు.

ఆర్బీకేల ద్వారా ఎరువులు
సార్వా పంటలో సుమారు 53,873 టన్నుల ఎరువులు అవసరమవుతాయని అధికారులు గుర్తించారు. దీనిలో 18,431 టన్నుల యూరియా, 3,352 టన్నుల డీఏపీ, 6,646 టన్నుల పొటాష్, 8,688 టన్నుల సూపర్ ఫాస్ఫేట్, 15,732 టన్నుల కాంప్లెక్స్ ఎరువులను సిద్ధం చేశారు. వీటిలో 17,938 టన్నుల ఎరువులను రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు విక్రయించనున్నారు.

1 నుంచి ఈ–క్రాప్
రైతులు తాము పండించిన ధాన్యాన్ని విక్రయించుకోడానికి, ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను పొందడానికి ఈ–క్రాప్ నమోదు తప్పనిసరి. వచ్చే నెల 1వ తేదీ నుంచి జిల్లాలో ఈ–క్రాప్ నమోదు ప్రారంభమై సెప్టెంబర్ మొదటి వారంలో పూర్తి చేయనున్నారు.

పొలం బడితో అవగాహన : సార్వా సాగులో రైతులు విచక్షణారహితంగా ఎరువులు, పురుగు మందులు వినియోగించకుండా పొలంబడి పేరుతో రైతులకు సమావేశాలు నిర్వహించి పెట్టుబడులు శాస్త్రీయంగా ఉండేలా అధికారులు అవగాహన కల్పిస్తారు. జిల్లాలోని 95 రైతు భరోసా కేంద్రాల పరిధిలో పొలంబడి నిర్వహిస్తారు.

రుణ ప్రణాళిక ఇలా..
జిల్లాలో రైతుల కోసం రూ.12,496 కోట్ల రుణ ప్రణాళికను సిద్ధం చేశారు. దీనిలో పంట రుణాలుగా రూ.7,080 కోట్లు, దీర్ఘకాలిక రుణాలుగా రూ.5,646 కోట్లు ఇవ్వనున్నారు. అలాగే 55,700 మందికి కౌలు కార్డులు అందించాలని లక్ష్యంగా నిర్దేశించారు.

ముందస్తు నాట్లు మేలు



జిల్లాలో సార్వా సీజన్‌కు పూర్తి ప్రణాళిక సిద్ధం చేశాం. సుమారు 2.40 లక్షల ఎకరాల్లో వరిసాగు చేయాల్సి ఉండగా ఈ మేరకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు సిద్ధం చేశాం. రైతులు ముందస్తుగా నాట్లు వేసుకుని సకాలంలో అవసరం మేరకు ఎరువులు వాడుకోవడంతో పెట్టుబడి ఖర్చులు తగ్గడంతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చు. రైతులంతా తప్పనిసరిగా ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలి.
– జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయశాఖాధికారి, భీమవరం

క్లుప్తంగా

క్షేత్ర పాలకుడికి రుద్రాభిషేకం



ద్వారకాతిరుమలలో శివయ్యకు రుద్రాభిషేకాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

ద్వారకాతిరుమల: క్షేత్రపాలకుడిగా విరాజిల్లుతోన్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి ఆలయంలో శివదేవుడికి శుక్రవారం ఏకాదశ రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. మాసశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జరిపిన ఈ వేడుక భక్తులకు నేత్రపర్వమైంది. ముందుగా సిబ్బంది ఆలయాన్ని, పరిసరాలను సుగంధభరిత పుష్పమాలికలు, మామిడి తోరణాలు, అరటి బోదెలతో అలంకరించారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ గర్భాలయంలో కొలువైన శివదేవునికి రుద్రాభిషేకాన్ని జరిపి, హారతులిచ్చారు. సాయంత్రం గంగా, పార్వతీ సమేత శివదేవుడు నంది వాహనంపై క్షేత్ర పురవీధుల్లో ఊరేగారు.

వృద్ధులకు వరం.. కంటి వెలుగు

- జిల్లాలో ముమ్మరంగా మూడో విడత కంటి వెలుగు
- ఇంతవరకు 2,861 మందికి ఆపరేషన్లు పూర్తి
- 32,086 మందికి కళ్లజోళ్ల పంపిణీ

భీమవరం(ప్రకాశం చౌక్): ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి వృద్ధుల కోసం అమలు చేస్తున్న కంటి వెలుగు పథకం వరప్రసాదంలా మారింది. విడతల వారీగా ఉచితంగా కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు, కళ్లద్దాలు, ఆపరేషన్లు చేయిస్తున్నారు. ఇప్పటికే రెండు విడతలల్లో వృద్ధులకు కంటి పరీక్షలు, వైద్యం అందించారు. మూడో విడత కంటి స్క్రీనింగ్ పరీక్షలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో మూడో విడత కంటి స్క్రీనింగ్ పరీక్షలు ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా 9 టీంలు పనిచేస్తున్నాయి. ఆయా సచివాలయాలకు వెళ్లి 60 ఏళ్ల దాటిన వృద్ధులకు కంటి పరీక్షలు చేసి వారికి అవసరమైన మందులు అందించి.. అవసరమైనవారికి కళ్లజోళ్లు, ఆపరేషన్లకు సిఫార్సు చేస్తున్నారు. మూడో విడతలో ఇంతవరకు 48,684 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 6,062 మందిని కళ్లజోళ్లకు సిఫార్సు చేశారు. 405 మందికి ఆపరేషన్లకు సిఫార్సు చేశారు. ఇంతవరకు 214 మందికి ఆపరేషన్ చేశారు.



గణపవరం మండలం పిప్పరలో వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఇంతవరకు 2,861 మందికి ఆపరేషన్లు

60 ఏళ్ల దాటి కంటి చూపు సరిగా లేక ఇబ్బంది పడే వృద్ధుల కష్టం తెలిసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వారి కోసం కంటి వెలుగు పథకం ప్రవేశపెట్టారు. వృద్ధులకు ఈ పథకం వరంగా మారింది. కంటి వెలుగు కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఇంతవరకు మూడు విడతల క్యాంపుల్లో 3126 మంది వృద్ధులకు ఆపరేషన్లు అవవసరమని గుర్తించారు. ఇంతవరకు 2,861 మందికితాపరేషన్లు పూర్తి చేశారు. మిగిలిన వారికి ఆపరేషన్ల ప్రక్రియ సాగుతుంది.

జిల్లాలో 60 ఏళ్ల దాటిన వారు	2,01,578 మంది
ఇంతవరకు కంటి పరీక్షలు చేయించుకున్నవారు	1,11,399 మంది
కళ్లజోళ్లు అవసరమైనవారు	40,356 మంది
ఇంతవరకు కళ్లజోళ్లు పొందిన వారు	32,086 మంది
ఆపరేషన్లకు సిఫార్సు చేసిన వారు	3,126
ఆపరేషన్లు పూర్తయినవారు	2861

నాకు చూపునిచ్చారు



నాకు కంటి చూపు సరిగా కనిపించకపోవండతో ఎదురుగా ఉన్న వాటిని గుద్దుకుని పడిపోయేవాడిని మా గ్రామ సచివాలయంలో కంటి వెలుగు పథకంలో వైద్యులు కంటి పరీక్షలు చేశారు. ఆపరేషన్ అవసరమని తణుకులో ఉచితంగా కంటి ఆపరేషన్ చేశారు. నాకు బాగా కనిపిస్తుంది. సీఎం జగన్ నాలాంటి కంటి చూపు సమస్య ఉన్నవారికి ఉచితంగా ఆపరేషన్లు చేయించడం కోసం మంచి పథకాన్ని పెట్టారు.

– మట్టా అంతర్వేది, పెనుమంచిలి, ఆచంట మండలం

ఉచితంగా ఆపరేషన్ చేశారు



నాకు సరిగా కనిపించేది కాదు. మా గ్రామంలో ప్రభుత్వం నిర్వహించిన కంటి వైద్య క్యాంపునకు వెళితే వైద్యులు పరీక్షలు నిర్వహించి ఆపరేషన్ అవసరమని చెప్పి తణుకులో ఉచితంగా ఆపరేషన్ చేయించారు. డబ్బులు పెట్టి ఆపరేషన్ చేయించుకోనే పరిస్థితి లేదు. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

– కె.ఆదిలక్ష్మి, నవుదూరు, వీరవాసరం మండలం

ఇంతవరకు 2,861 ఆపరేషన్లు పూర్తి



జిల్లా వ్యాప్తంగా 3వ విడత కంటి వెలుగు కార్యక్రమం జరుగుతుంది. జిల్లాలో 9 టీంలు ఈ కార్యక్రమం ద్వారా 60 ఏళ్ల దాటిన వృద్ధులకు కంటి స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్నారు. ఇంతవరకు కంటి వెలుగు పథకంలో 2861 మందికి ఆపరేషన్లు జరిగాయి. మిగిలిన వారికి వేగంగా ఆపరేషన్లు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇంతవరకు 32,086 మందికి కళ్లజోళ్లు అందించాం.

– పి.ప్రశాంతి, జిల్లా కలెక్టర్

రూ.2.50 లక్షలు కాజేసిన సైబర్ మోసగాళ్లు

కుక్కునూరు: వర్క్‌ఫ్రం హోం అంటూ వాట్సప్ మెసేజ్ చూసి సైబర్ కేటుగాళ్ల చేతిలో చిక్కి రూ.2.50 లక్షలు పోగొట్టుకున్నాడు మండలానికి చెందిన ఓ యువకుడు. మండలానికి చెందిన ఓ యువకుడు డిగ్రీ పూర్తి చేశాడు. ప్రస్తుతం డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల అతని ఫోన్ నెంబర్‌కు వర్క్ ఫ్రం హోం ద్వారా పార్ట్ టైం వర్క్ చేస్తూ ఇంటి వద్దే ఉంటూ సంపాదించుకోవచ్చని వచ్చిన మెసేజ్ చూసి సైబర్ కేటుగాళ్లకు కనెక్ట్ అయ్యాడు. వారు ఆ యువకుడిని టెలిగ్రాం యాప్ ద్వారా కనెక్ట్ అవ్వాలని సూచించారు. తరువాత గూగుల్ మ్యాప్ ఓపెన్ చేసి హోటళ్లకు ర్యాంకింగ్ ఇవ్వాలని, వీడియోస్ చూసి లైక్ చేసి ఆ స్క్రీన్ షాట్‌ను గ్రూపులో షేర్ చేయాలని చెప్పారు. అలా చేస్తే టాస్క్‌కి కమిషన్ డిపాజిట్ చేస్తామని చెప్పారు. అన్న ప్రకారమే ఆ యువకుడికి టాస్క్‌కు రూ. 80 చొప్పున డిపాజిట్ చేస్తూ వచ్చారు. ఆ యువకుడి ఖాతాలో రూ.1500 వరకూ జమచేశారు. ఆ కేటుగాళ్లు వచ్చే కమిషన్‌ను క్రిప్టోలో పెడితే లక్షల్లో కమిషన్ పొందొచ్చని చెప్పి నమ్మించారు. టాస్క్ పూర్తిచేసిన ప్రతిసారి టాస్క్ అమౌంట్‌తో పాటు బోనస్ యాడ్ చేసి ఆ డబ్బును విత్‌డ్రా చేసుకునే అవకాశం లేకుండా చేశారు. ఆ యువకుడు పూర్తిగా అందులో మునిగాక టాస్క్‌లో తప్పులు చేశావని నీ అమౌంట్ విత్‌డ్రా చేసుకోవాలంటే యూపీఐ ద్వారా కొంత మేర డిపాజిట్ చేసి మరోసారి టాస్క్ ఆడాలని అప్పుడే విత్‌డ్రా చేసుకోవచ్చని ఆ యువకుడి నుంచి అంచెలంచెలుగా రూ. 2.50 లక్షలు కాజేశారు. ఇంకా డిపాజిట్ చేయాలంటూ మెసేజ్‌లు చేస్తుండడంతో అనుమానం వచ్చిన యువకుడు సైబర్ క్రైం టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి కంప్లెయింట్ చేశాడు. విచారణ చేసిన పోలీసులు అప్పటికే ఆ ఖాతా నుంచి కేటుగాళ్లు మొత్తం డబ్బును విత్‌డ్రా చేసి కేవలం రూ. 66 ఉంచారని చెప్పారు. ఆ యువకుడు తాను సంపాదించిన దాంతో పాటు అప్పు తీసుకుని మరీ సైబర్ కేటుగాళ్లకు సమర్పించుకున్నానని కన్నీరు మున్నీరయ్యాడు. తనలాగా ఎవరూ కూడా ఫేక్ మెసేజ్‌లు చూసి మోసపోవద్దని చెప్పాడు.

పెళ్లిళ్లకు విరామం

మళ్లీ ఆగస్టు 18 నుంచి ముహూర్తాలు



ద్వారకాతిరుమల: మూడుముళ్ల బంధానికి ముఖ్యమైంది ముహూర్తం. పెళ్లి పనులు ప్రారంభించడం దగ్గర నుంచి అన్ని పనులకు ముహూర్తాలు చూస్తారు. అలాంటి ముహూర్తాలకు రెండు నెలల పాటు బ్రేక్ పడింది. ఈ ఏడాది జనవరి 22 నుంచి మార్చి 17 వరకు వివాహాలు జోరుగా జరిగాయి. ఆ తరువాత గురుమూఢం కారణంగా ఏప్రిల్ నెలలో వివాహాలు జరగలేదు. తిరిగి మే 3 నుంచి ప్రారంభమైన శుభముహూర్తాలు ఈ నెల 11తో ముగిశాయి. ఆయా ముహూర్తాల్లో జిల్లా వ్యాప్తంగా వేలాదిగా వివాహాలు జరిగాయి. ఈనెల 19 నుంచి ఆషాఢ మాసం ప్రారంభం కానుంది. ఆగస్టు 17 వరకు పెళ్లి సందడికి విరామం రావడంతో అప్పటి వరకు కల్యాణ ఘడియల కోసం ఆగాల్సిందేనని పురోహితులు చెబుతున్నారు. వివాహాది శుభకార్యాలపై ఆధారపడి జీవనోపాధి పొందే పురోహితులు, పచ్చిపూల మండపాలు, డెకరేషన్, షామియానా పందిళ్లు నిర్మించే వారు, వాద్యకారులు, కేటరింగ్, లైటింగ్ ఏర్పాటు చేసే రెండు నెలల పాటు పనులు లేనట్టే.

ఈ ఏడాదిలో మిగిలిన ముహూర్తాలు..

ఈ ఏడాది ఆగస్టు 18, 19, 20, 24, 26, 30, సెప్టెంబర్ 1, 2, 3, 7, అక్టోబర్ 25, 26, నవంబర్ 1, 9, 16, 17, 18, 19, 22, 23, 29, డిసెంబర్ 3, 6, 7, 14, 15, 16, 17 తేదీల్లో ముహూర్తాలున్నాయని పురోహితుడు గోవిందవఝుల వెంకటరమణ మూర్తి శర్మ తెలిపారు.

వడగాలులకు వ్యక్తి మృతి



రాయపాటి రాము

ఆకివీడు : వడగాలులకు వ్యవసాయ కూలీ రాయపాటి రాము(59) శుక్రవారం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. దివ్యాంగుడైన రాము దుంపగడప గ్రామంలోని రైల్వే గేటు సమీపంలో నివసిస్తున్నాడు. కొన్నేళ్ళక్రితం ప్రమాదంలో కాలు కోల్పోయాడు. గురువారం జ్వరం రావడంతో స్థానికంగా ప్రైవేటు వైద్యులతో వైద్యం చేయించుకున్నారు. శుక్రవారం తీవ్ర అస్వస్థతకు గురికావడంతో స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మధ్యలో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.

క్షీరారామలింగేశ్వరస్వామికి లీలా కల్యాణం



పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం మాసశివరాత్రి సందర్భంగా స్వామివారికి లీలా కల్యాణం నిర్వహించారు. భక్తులు ఉదయం నుంచి స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, అమ్మవార్లకు కుంకుమ పూజలు చేశారు. రాత్రి ఆలయ అభిషేక పండితులు భమిడపాటి వెంకన్న బ్రహ్మత్వంలో ముందుగా స్వామివారికి లక్ష ముత్యాలపూజ అనంతరం లీలా కళ్యాణం చేశారు. ఈ సందర్భంగా 14 మంది దంపతులు ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

దత్తత పిల్లలకు మంచి జీవితాన్ని అందించాలి



చిన్నారిని దత్తత ఇస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు(మెట్రో) : దత్తత తీసుకున్న తల్లితండ్రులు పిల్లలకు మంచి జీవితాన్ని అందించాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. తెలంగాణ రాష్ట్రం వరంగల్‌కు చెందిన దత్తత అర్జీదారులు బెజ్జం కొమరయ్య, సత్యవాణిలకు సంవత్సరం వయసున్న సిరిని శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ దత్తత ఇచ్చారు. అర్జీదారులు 2019లో ఆడ పాప కోసం దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. దత్తత తీసుకున్న పిల్లలను క్రమశిక్షణతో పెంచి వారికి మంచి జీవితాన్ని అందించాలన్నారు. వారికి ఉజ్వల భవిష్యత్తు అందించాల్సిన బాధ్యత దత్తత తీసుకున్న తల్లితండ్రులదేనని కలెక్టర్ చెప్పారు.

ఓటర్ల జాబితా సవరణపై వీడియో కాన్ఫరెన్స్

జిల్లాలో 18 సంవత్సరాలు వయస్సు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదయ్యేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనాకు చెప్పారు. ఓటర్ల జాబితా సవరణపై కలెక్టర్లతో శుక్రవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలో జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణను సీఈఓకు కలెక్టర్ వివరించారు. జిల్లాలో జనవరి 15 నాటికి మొత్తం 15,86,077 మంది ఓటర్లుగా నమోదయ్యారన్నారు. ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో చేర్పులకు 7,322 దరఖాస్తులు అందాయని, తొలగింపు నిమిత్తం 16,523 దరఖాస్తులు అందాయన్నారు.

● ఒకే కాన్పులో ముగ్గురు శిశువులు



పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో గర్భిణీ ముగ్గురు శిశువులకు జన్మనిచ్చింది. వైద్యురాలు డాక్టర్ ఉమాదేవి వివరాలు వెల్లడిస్తూ.. ఆచంట మండలానికి చెందిన శ్రీదేవికి శుక్రవారం ఆపరేషన్ చేయగా.. ఇద్దరు పాపలు, ఒక బాబు పుట్టారని చెప్పారు. గత 14 ఏళ్లుగా పిల్లలు లేక ఎదురుచూస్తున్న శ్రీదేవి గత కొంతకాలంగా తమ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటుందన్నారు. తల్లి, పిల్లలు క్షేమంగా ఉన్నారన్నారు.

– పాలకొల్లు సెంట్రల్

యువకుడి అదృశ్యంపై దర్యాప్తు



అదృశ్యమైన దల్లి దుర్గారెడ్డి



లక్కవరంలో ఎర్రకాలువ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ ధనుంజయ్

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని లక్కవరానికి చెందిన దల్లి దుర్గారెడ్డి కనిపించకపోవడంతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. లక్కవరం సమీపంలో ఎర్రకాలువ ప్రధాన వాగు ఒడ్డున దుర్గారెడ్డి చెప్పులు, ద్విచక్రవాహనం ఉండటంతో సమాచారం అందుకున్న డీఎస్పీ ధనుంజయ్, ఎస్సై దుర్గా మహేశ్వరరావు శుక్రవారం సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. దుర్గారెడ్డి కౌలుకు వ్యవసాయం చేస్తాడు. ఈ నెల 15న మధ్యాహ్నం బ్యాంకు నుంచి నగదు తీసుకొస్తానని చెప్పి జంగారెడ్డిగూడెం వచ్చాడు. సాయంత్రం కావస్తున్నా రాకపోవడంతో భార్య అనురాధ దుర్గారెడ్డికి ఫోన్ చేసింది. ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో అనుమానంతో పరిసర ప్రాంతాల్లో గాలింపు చేపట్టారు. లక్కవరం ఎర్రకాలువ ప్రధాన కాలువ ఒడ్డున దుర్గారెడ్డి చెప్పులు ద్విచక్ర వాహనం కనిపించడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న డీఎస్పీ గత ఈతగాళ్లతో కాలువలో గాలింపు చేపట్టారు. ఆచూకీ లభించకపోవడంతో పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. బ్యాంకు నుంచి రూ.4.80 లక్షల నగదు తీసుకుని ఇంటికి వెళ్తుండగా దుర్గారెడ్డి కనిపించకుండా పోయాడనే సమాచారం రావడంతో.. బ్యాంకులో విచారించగా ఎలాంటి నగదు దుర్గారెడ్డి డ్రా చేయలేదని తేలింది. దుర్గారెడ్డి అదృశ్యంపై కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ తెలిపారు.

కిడ్నాప్ కేసును ఛేదించిన పోలీసులు



కారును తనిఖీ చేస్తున్న ఏలూరు టూటౌన్ పోలీసులు

ఏలూరు టౌన్ : ఏలూరు జీజీహెచ్ నుంచి ఒక వ్యక్తిని కొందరు దుండగులు బలవంతంగా కారులో కిడ్నాప్ చేశారనే సమాచారంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. జిల్లా ఎస్పీ డీ.మేరీ ప్రశాంతి ఆదేశాలతో డీఎస్పీ ఈ.శ్రీనివాసులు పర్యవేక్షణలో టూటౌన్ సీఐ పీ.చంద్రశేఖర్ దర్యాప్తు చేపట్టారు. కేవలం 12గంటల వ్యవధిలోనే కేసును ఛేదించి కిడ్నాప్‌కు యత్నించిన వ్యక్తులను అరెస్ట్ చేశారు. చేబ్రోలు రైల్వేస్టేషన్ మాస్టర్‌గా పనిచేస్తోన్న పుట్టి చంద్రశేఖర్ భార్య చనిపోవటంతో మరొక మహిళను వివాహం చేసుకున్నాడు. భర్త చనిపోయిన పంచకర్ల గ్రీష్మ అనే మహిళను రెండేళ్ళ క్రితం వివాహం చేసుకున్నట్లు తెలిసింది. కొద్ది రోజులుగా చంద్రశేఖర్, గ్రీష్మ మధ్య విభేదాలు రావడంతో వేర్వేరుగా ఉంటున్నారు. ఈ నెల 15న రాత్రి 10గంటల సమయంలో జీజీహెచ్‌కు చంద్రశేఖర్ వచ్చాడు. ఇంతలో మాదేపల్లికి చెందిన బాలిబోయిన నవహర్షతోపాటు మరో ఏడుగురు వ్యక్తులు చంద్రశేఖర్‌ను బలవంతంగా జీపులో ఎక్కించుకుని తీసుకువెళ్ళారు. ఏలూరు శివారు పోణంగి ప్రాంతంలోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకువెళ్ళి చంద్రశేఖర్‌ను కొట్టారు. ఏలూరు జీజీహెచ్‌లో పనిచేసే గ్రీష్మ చుట్టూ తిరిగితే ఊరుకోబోమని హెచ్చరించారు. అనంతరం ఖాళీ ప్రామిసరీ నోట్లు, ఇతర డాక్యుమెంట్లపై సంతకాలు తీసుకుని బెదిరించి, వదిలేశారు. చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు ఏలూరు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో హర్షతోపాటు ఆముదాల అప్పలస్వామి కాలనీకి చెందిన పద్మారావు, శరణ్‌కుమార్, కొత్తవీధికి చెందిన ప్రసాద్‌కుమార్, పోణంగికి చెందిన మహ్మద్ బాషా, వంగాయగూడెంకు చెందిన సురేష్, కేశవ, అఖిల్ అనే వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు.

పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య



మృతురాలు కళ్లెం మాధవి (ఫైల్)

ద్వారకాతిరుమల: మండలంలోని జి.కొత్తపల్లికి చెందిన కళ్లెం మాధవి(40) గురువారం మధ్యాహ్నం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఆమెతో సహజీవనం చేస్తున్న వ్యక్తి, అలాగే ద్వారకాతిరుమల పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబులే మాధవి మృతికి కారణమని మృతురాలి కుటుంబ సభ్యులు ఆరోపించారు. బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మాధవి భర్త తొమ్మిదేళ్ల క్రితం మృతి చెందాడు. గ్రామానికి చెందిన పొంగులేటి భూషణం అనే యువకుడు ఎనిమిదేళ్లుగా ఆమెతో సహజీవనం చేస్తున్నాడు. మాధవి ఇటీవల వైఎస్సార్ ఆసరా పథకానికి నామినీగా భూషణం పేరు పెట్టాలని సచివాలయానికి వెళ్లింది. ఆ సమయంలో భూషణం తల్లి, బంధువులు నామినీగా అతడి పేరు పెట్టొద్దని మాధవితో గొడవ పడి, ఆమెను అడ్డగించారు. ద్వారకాతిరుమల పోలీస్టేషన్‌కు చెందిన ఒక కానిస్టేబుల్ సైతం మాధవిని బెదిరించినట్టు ఆమె చెల్లెలు నిర్మల, సోదరుడు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉంటే భూషణం గురువారం మధ్యాహ్నం పురుగుల మందు తెచ్చి తమ కుటుంబ సభ్యులను బెదిరించడానికి దాన్ని తాగాలని సూచించడంతో మాధవి ఆ మందును తాగిందని చెబుతున్నారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను స్థానికుల సహాయంతో కుటుంబ సభ్యులు జంగారెడ్డిగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందింది. శుక్రవారం సాయంత్రం నాటికి కూడా వైద్యులు మృత దేహానికి పోస్టుమార్టం నిర్వహించక పోవడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. వెంటనే పోస్టుమార్టం జరిపి, తమ అక్క మృతికి కారకులైన భూషణం, కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.


వరకట్న వేధింపుల కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: వివాహిత ఫిర్యాదు మేరకు వరకట్న వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. జంగారెడ్డిగూడెంకు చెందిన హిమబిందుకు, కృష్ణాజిల్లా బొమ్మలినగర్‌కు చెందిన తుమ్మల మోతీలాల్ చందుతో గత ఏడాది మేలో వివాహమైంది. వివాహ సమయంలో రూ.20 లక్షల నగదు, 10 కాసుల బంగారం కట్నంగా ఇచ్చారు. మోతీలాల్ చందుకు గతంలో వివాహమై విడాకులు అయ్యాయని, ఆ విషయాన్ని దాచి హిమబిందును వివాహం చేసుకున్నాడన్నారు. వివాహం తరువాత చెడు వ్యసనాలకు లోనై అధిక కట్నం కోసం హిమబిందును వేధిస్తున్నట్లు తెలిపారు. మోతీలాల్ చందుకు మరో నలుగురు సహకరిస్తున్నారని హిమబిందు ఫిర్యాదులో పేర్కొందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

ఉంగుటూరు: మండలంలోని వెల్లమిల్లికి చెందిన కృపాజ్యోతి(30) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోటం రాజారావుకు గణపవరం మండలం కోమర్రుకు చెందిన కృపాజ్యోతితో 7 ఏళ్ల క్రితం వివాహమైంది. భార్యభర్తలు ఇరువురు కువైట్ ఉంటున్నారు. వీరి కుమార్తె వెల్లమిల్లిలో నానమ్మ వద్ద ఉంటోంది. కృపాజ్యోతి తన తమ్ముడు వివాహం నిమిత్తం ఏప్రిల్ 30న గణపవరం మండలం కోమర్రు వచ్చింది. కోమర్రులో జూన్ 8న వివాహం జరిగింది. తనవద్ద రూ.1.40 లక్షలు కుమార్తె పేరున బ్యాంకులో వేయాలనుకుంది. కువైట్‌లో ఉన్న తన భర్త రాజారావు ఫోను చేసి ఇల్లు బాగుచేయడానికి అమ్మనాన్నలకు ఆ డబ్బు ఇవ్వమని చెప్పాడు. దాంతో మనస్తాపానికి గురైన కృపాజ్యోతి గురువారం పురుగులమందు తాగింది. వెంటనే తాడేపల్లిగూడెం ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గురువారం రాత్రి మృతిచెందింది. చేబ్రోలు ఎస్ఐ స్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేషనల్ లెజిస్లేచర్స్ కౌన్సిల్ మీటింగ్‌లో ఎలీజా



ముంబైలో నేషనల్ లెజిస్లేచర్స్ కౌన్సిల్ మీటింగ్‌లో ఎమ్మెల్యేలు వీఆర్ ఎలీజా, తలారి వెంకట్రావులు

జంగారెడ్డిగూడెం : ముంబైలో జరుగుతున్న నేషనల్ లెజిస్లేచర్స్ కౌన్సిల్ మీటింగ్‌లో చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా పాల్గొన్నారు. ఈ నెల 15 నుంచి 17 వరకు సమావేశం జరుగుతుంది. సమావేశంలో సమగ్ర దేశాభివృద్ధి, ప్రజాస్వామ్య విలువలు కాపాడటం తదితర అంశాలపై చర్చ జరగనున్నట్లు ఎమ్మెల్యే ఎలీజా తెలిపారు. దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి ఈ సమావేశానికి పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఈ సమావేశంలో పాల్గొన్నట్లు ఆయన చెప్పారు.

క్లుప్తంగా

ఉమా చంద్రశేఖరస్వామికి ప్రత్యేక పూజలు



వాసవి ఆలయంలో ప్రత్యేక పూజలు దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): జ్యేష్ఠ మాసం శుక్రవారం వాసవి కన్యకా పరమేశ్వరి పంచాయతన క్షేత్రంలో మాస శివరాత్రి పురస్కరించుకొని ఉమా చంద్రశేఖర స్వామికి పంచామృతాలతో, ఫలరసాలు, సుగంధ ద్రవ్యాలతో విశేష అభిషేకాలు, స్వామివారికి విశేష అలంకరణ గావించారు. ఆర్యవైశ్య సంఘం కోశాధికారి నున్న బాలా త్రిపుర సుందరరావు, సంఘం నాయకులు పేరూరి కాశయ్య, ఆలయ కార్యదర్శులు శ్యామ్‌లు పర్యవేక్షించారు. తొలుత విఘ్నేశ్వర పూజ, కృత్తికా నక్షత్రం సందర్భంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి, అమ్మవారికి విశేష పూజలు, అలంకరణలు జరిగాయి.

డయల్ యువర్ డీఎంకు విశేష స్పందన



ఫోన్‌లో సమస్యలు వింటున్న డిపో మేనేజరు సత్యనారాయణమూర్తి

తణుకు అర్బన్: తణుకు ఆర్టీసీ డిపోలో శుక్రవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి మంచి స్పందన వచ్చినట్లు డిపో మేనేజరు పీఎస్‌వీఎం సత్యనారాయణ మూర్తి తెలిపారు. ప్రయాణికులు తమతమ ప్రయాణాల్లో అవసరమైన వసతులను అమలు చేయాలని కోరినట్లు వివరించారు. నరసాపురం నుంచి చివరి బస్సును రాత్రి 9.30 గంటలకు ఏర్పాటు చేయాల్సిందిగాను, రావులపాలెం నుంచి తణుకు వచ్చే బస్సులు ఖండవల్లి గ్రామంలోకి వచ్చే విధంగాను, తణుకు నుంచి పెనుగొండ వెళ్లే బస్సులు కె.ఇల్లింద్రపర్రు గ్రామం మీదుగా వెళ్తే విద్యార్థులకు, వైద్యశాలలకు వెళ్లే వారికి సౌకర్యంగా ఉంటుందని పలువురు ప్రయాణికులు అడిగినట్లు చెప్పారు. పరిష్కరించే దిశగా కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు వివరించారు.

ఘనంగా ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ



ఆదర్శ ఉద్యోగులను అభినందిస్తున్న వీరయ్యచౌదరి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీఎస్ ఆర్టీసీ తాడేపల్లిగూడెం డిపోలో శుక్రవారం ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ జరిగింది. జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.వీరయ్య చౌదరి హాజరై ఉత్తమ ప్రతిభ ప్రదర్శించిన కండక్టర్లు, డ్రైవర్లు డీఎస్‌రావు, కేవీ రత్నంలను అభినందించి, వారికి నగదు బహుమతి, ప్రశంసా పత్రం అందజేశారు. వీరయ్య చౌదరి మాట్లాడుతూ హైదరాబాద్ రూట్‌లో ప్రవేశపెట్టిన ఇంద్ర ఏసీ, ఆచంట రూట్‌లో అదనపు బస్సులను ప్రజాదారణ పొందేలా నడపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి, గేరేజి, ట్రాఫిక్, సెక్యూరిటీ సిబ్బంది, సూపర్‌వైజర్లు, అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాస రచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో హెచ్‌ఎం పద్మావతి, ఉపాధ్యాయులు

తణుకు అర్బన్: యోగా డే వారోత్సవాలను తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం కె.పద్మావతి ఆధ్వర్యంలో నిర్వహించిన వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. జూన్ 21వ తేదీ అంతర్జాతీయ యోగాను పురస్కరించుకుని బహుమతులు అందచేస్తామని వివరించారు. కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ జిజె.ప్రభువరం, వ్యాయామ ఉపాధ్యాయులు నాగరాజ్యం, జయమ్మ, ఉపాధ్యాయులు అక్కింశెట్టి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

బడి బస్సుకు సామర్థ్య పరీక్షలు

- పాఠశాలలు ప్రారంభమైనా కొనసాగుతున్న పరీక్షలు
- ఫిట్‌నెస్ కోసం రవాణాశాఖ కసరత్తు
- ఫిట్‌నెస్ లేకపోతే చర్యలు తప్పవంటున్న అధికారులు



పాఠశాల బస్సును తనిఖీ చేస్తున్న రవాణాశాఖ అధికారులు

తణుకు: పాఠశాలలు పునఃప్రారభమయ్యాయి... వేసవి సెలవుల్లో పిల్లలను చేర్పించుకునేందుకు ఉపాధ్యాయులు, సిబ్బందితో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించిన ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు సకాలంలో అడ్మిషన్లు కూడా పూర్తి చేసుకున్నాయి. అయితే పిల్లలను ప్రతిరోజు ఇంటి నుంచి స్కూల్‌కు, స్కూల్ నుంచి ఇంటికి తరలించే బస్సులను నిబంధనల ప్రకారం సిద్ధం చేయడంలో మాత్రం ఆసక్తి చూపడం లేదు. పిల్లల ప్రయాణాలు, వారి భద్రత విషయంలో మాత్రం నిర్లక్ష్యాన్ని వీడలేకపోతున్నారు. ఏటా పాఠశాలలు ప్రారంభం కాకముందే సామర్థ్య పరీక్షలు పూర్తి చేయాల్సి ఉండగా ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. అధికారులు మాత్రం దాడులు చేస్తున్నామని, బస్సులను సీజ్ చేస్తామని ప్రతి ఏటా చెబుతూనే ఉన్నారు.

45 బస్సులకు ఫిట్‌నెస్ నిరాకరణ

ప్రైవేటు విద్యాసంస్థల బస్సులు రోడ్డుమీదకు రావాలంటే తప్పనిసరిగా రవాణాశాఖ జారీ చేసిన సామర్థ్య ధ్రువీకరణ పత్రం ఉండాలి. తణుకు రవాణా శాఖ యూనిట్ కార్యాలయం పరిధిలో 230 వరకు విద్యాసంస్థల బస్సులు ఉన్నాయి. పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో రవాణాశాఖ అధికారులు ప్రైవేటు విద్యాసంస్థల బస్సుల కండీషన్‌పై దృష్టి సారించారు. రోజుకు 10 నుంచి 20 వరకు బస్సులు ఫిట్‌నెస్ పరీక్షలకు వస్తున్నాయి. అధికారులు నిశితంగా పరిశీలించి స్వయంగా వాహనాలు నడిపి పనితీరును పరీక్షిస్తున్నారు. ఇప్పటి వరకు 161 బస్సులకు పరీక్షలు పూర్తి చేసి ఫిట్‌నెస్ పత్రాలు జారీ చేశారు. మరో 45 బస్సులకు లోపాలు గుర్తించి వెనక్కు పంపించారు. నిబంధనలు పాటించని యాజమాన్యాలకు సైతం నోటీసులు జారీ చేస్తున్నారు. ముఖ్యంగా ఫిట్‌నెస్ కోసం వస్తున్న బస్సులను అధికారులు పరిశీలిస్తున్న సమయంలో పలు లోపాలు బయట పడుతున్నాయి. అత్యవసర ద్వారం వెంటనే తెరుచుకోకపోవడం, బస్సులోకి ఎక్కే మెట్లు సరైన ఎత్తులో ఉండకపోవడం, సీట్లు సక్రమంగా లేకపోవడం వంటి లోపాలను అధికారులు గుర్తిస్తున్నట్లు తెలుస్తోంది.

యాజమాన్యాలు పాటించాల్సినవి...

- వాహన చట్ట ప్రకారం రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, పర్మిట్, పన్ను చెల్లింపు రసీదు, పొల్యూషన్ సర్టిఫికెట్‌తోపాటు డ్రైవర్లకు లైసెన్సులు తప్పనిసరిగా ఉండాలి.
- డ్రైవర్ ఫొటోను బస్సులో తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి.
- అద్దాలకు గ్రిల్స్ అమర్చి ఉండాలి.
- డ్రైవర్‌కు 60 ఏళ్ల వయస్సు మించి ఉండకుండా కనీసం అయిదేళ్ల అనుభవం కలిగి ఉండాలి.
- ప్రతి బస్సులో అటెండర్‌తోపాటు రూట్ మ్యాప్ కచ్చితంగా ఉండాలి.

నిబంధనలు అతిక్రమిస్తే సీజ్ చేస్తాం



ప్రైవేటు స్కూల్ బస్సుల విషయంలో నిబంధనలు కచ్చితంగా పాటించాలి. పిల్లల విషయంలో ప్రైవేటు స్కూల్ యాజమాన్యాలు అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు. పూర్తిస్థాయిలో పాఠశాలలు తెరిచాక ఫిట్ నెస్ లేకుండా బస్సులు రోడ్లపై తిరిగితే సీజ్ చేస్తాం. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తాం.

– ఎం.రవికుమార్, ఏఎంవీఐ, తణుకు

- ప్రతి నెలా స్కూల్ ప్రిన్సిపాల్, పేరెంట్స్ కమిటీ తప్పనిసరిగా బస్సులను తనిఖీ చేయాలి.
- పరిమితికి మించి బస్సులో విద్యార్థులను ఎక్కించకుండా జాగ్రత్తలు పాటించాలి.
- బస్సులకు తప్పనిసరిగా పసుపురంగు వేయాలి.
- పాఠశాల పేరు, సెల్‌ఫోన్ నెంబర్, పూర్తి చిరునామా బస్సునకు ఎడమవైపున కనిపించేలా ఉండాలి.
- డ్రైవర్లు మూడు నెలలకోసారి బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకోవాలి.
- ఫిట్‌నెస్ పొందేటప్పుడు డ్రైవర్ వివరాలను తప్పనిసరిగా ఆన్‌లైన్ దరఖాస్తులో నమోదు చేయాలి.
- 15 ఏళ్లు దాటిన స్కూలు బస్సులను తుక్కు కింద పరిగణించాలని కేంద్రం నిర్ణయం తీసుకుంది. అలాంటి వాహనాలకు అనుమతి ఉండదు.
- కిటికీకు స్క్రీన్, వైపర్స్, లైటింగ్ పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలించాలి. ఏమైనా లోపాటు గుర్తిస్తే రికార్డులో నమోదు చేసి తక్షణమే మరమ్మతులు చేయించాలి.
- ప్రథమ చికిత్స కిట్, అత్యవసరమైన మందులు బస్సులో ఉంచాలి.

కౌలు కార్డుల మంజూరుకు సహకరించాలి

ఇరగవరం: మండలంలోని కౌలు రైతులు కౌలు కార్డుల మంజూరు సహకరించాలని మండల వ్యవసాయ అధికారి రాఘవేంద్ర అన్నారు. శుక్రవారం ఇరగవరం తహసీల్దార్ కార్యాలయంలో తూర్పు విప్పార్రు, కె ఇల్లిందలపర్రు, సూరంపూడి, గోటేరు, కె కుముదువల్లి, ఏలేటిపాడు, పేకేరు, అయితంపూడి గ్రామాల్లోని కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డుల పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీసీఆర్సీ కార్డులు గ్రామ రెవిన్యూ అధికారులు వద్దకు వెళ్లి రాయించుకోవాలన్నారు. ఈ కార్డుల వల్ల కౌలు రైతులకు రైతు భరోసా, ఈ పంట నమోదు , పంట నష్ట పరిహారం, క్రాఫ్ ఇన్సూరెన్స్, సున్నా వడ్డీ, వంటి పథకాలకు అర్హులు కావడానికి ఈ కార్డులు తప్పని సరిగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల విఆర్వోలు, విఏలు, వీహెచ్ఏలు తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రిచే జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ

అత్తిలి: నేడు అత్తిలి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చేతులమీదుగా జగనన్నవిద్యాకానుక కిట్లను అందజేస్తారని మండల పార్టీ అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ తెలిపారు. శనివారం ఉదయం తణుకు రోడ్డులో గల పెట్రోల్ బంకు వద్ద రూ. 22 కోట్లతో చేపట్టే ఆర్అండ్‌బీ రహదారి విస్తరణ పనులను మంత్రి ప్రారంభిస్తారని చెప్పారు. అత్తిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కొమ్మర జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేస్తారని తెలిపారు. పార్టీ కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు



కొమరవరంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మెడల్స్ అందజేస్తున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

తణుకు టౌన్: రాష్ట్రంలో భావి తరాల భవిష్యత్ కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత నాలుగేళ్లలో రూ. 68 వేల కోట్లు ఖర్చు చేసి వివిధ పథకాలు అమలు చేస్తున్నారని పౌర సరఫరాలు వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. శుక్రవారం తణుకు రూరల్ మండలం కొమరవరం గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆణిముత్యాలు, జగనన్న విద్యా కానుక పంపిణీ కార్యక్రమాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం, దేశంలో ఏ రాష్ట్రంలో చేయని విధంగా నాడు–నేడు పథకం ద్వారా విద్యారంగంలో 9 రకాల మౌలిక సదుపాయాలను కల్పించినట్లు తెలిపారు. విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి ఈ సంవత్సరం నుంచి జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపేందుకు ప్రతి పాఠశాలలో స్థాయి, నియోజకవర్గ స్థాయి, జిల్లా స్థాయిల్లో పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులను గుర్తించి వారిని , వారి తల్లిదండ్రులను నగదు పారితోషికాలతో పాటు ప్రసంశా పత్రాలు, మెమొంటోలతో సత్కరిస్తున్నట్లు తెలిపారు. గతంలో చంద్రబాబు నాయుడు పేదల పిల్లలకు ఇంగ్లీష్‌లో మీడియం బోధన వద్దన్నారని, అయితే వారి పిల్లలు మాత్రం ఇంగ్లీష్ మీడియంలోనే చదివారని చెప్పారు. ఇంగ్లీష్ మీడియం వద్దంటూ చంద్రబాబు నాయుడు టీడీపీ ఎమ్మెల్సీలు బిల్లును వ్యతిరేకించారని చెప్పారు. ఈసందర్భంగా కొమరవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన ఆత్కూరి రోషిణీ (570 మార్కులు) ప్రథమ, ఆకాశపు చంద్ర వర్షిణి (531 మార్కులు) ద్వితీయ, గనసాల సాయిదేవీ ప్రియ (519 మార్కులు) తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు నగదు పారితోషికం, సర్టిఫికేట్, మెమెంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, గ్రామ సర్పంచ్ కరిబండి రాజేష్, ఉప సర్పంచ్ గోళ్ల ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు నిమ్మకాయల సురేష్, కె ఇల్లందలపర్రు సొసైటీ అధ్యక్షుడు మలిరెడ్డి నాగార్జున, ఎంఈవో ఎస్ శ్రీనివాసరావు, హెచ్‌ఎం, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేద విద్యార్థులను ప్రోత్సహించడానికే ఆణిముత్యాలు



పెదతాడేపల్లి గురుకుల విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్న జెడ్పీటీసీ ఆంజనేయులు

తాడేపల్లిగూడెం రూరల్: పేద విద్యార్థులు విద్య వైపు ప్రోత్సహించడానికే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆణిముత్యాలు కార్యక్రమాన్ని ప్రారంభించారని జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు అన్నారు. మండలంలోని పెదతాడేపల్లి డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ గురుకుల విద్యాలయలో విద్యనభ్యసించి పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ఐదుగురికి ప్రోత్సాహక నగదును అందజేశారు. ఈ సందర్భంగా శుక్రవారం స్కూలు ఆవరణలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ ముత్యాల అంజనేయులు పాల్గొని మాట్లాడుతూ పది, ఇంటర్‌లో ప్రతిభకనబర్చిన విద్యార్థులకు ఈ ప్రోత్సాహకాలు అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వి.హనుమ, పెదతాడేపల్లి సొసైటీ చైర్మన్ పరిమి తులసీదాస్, ప్రిన్సిపల్ బి.రాజారావు, పరిమి రంగ, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

వర్గీకరణ చేయకపోవడం బాధాకరం

తాడేపల్లిగూడెం రూరల్: ఎస్సీ వర్గీకరణపై 1965లోనే లోకురు కమిషన్, జస్టిస్ ఉషా మెహ్రా కమిషన్, జస్టిస్ రామచంద్రరావు కమిషన్ నివేదికకు అనుకూలంగా తీర్పు ఇచ్చినప్పటికీ వర్గీకరణ చేయకపోవడం బాధాకరమని మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి విస్సంపల్లి సిద్ధూ ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని కృష్ణాయపాలెం గ్రామంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ అనుబంధ సంఘాల నూతన గ్రామ కమిటీని గురువారం రాత్రి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిద్ధూ మాట్లాడారు. ఎంఎస్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు దూలపల్లి శ్రీనివాసరావు, నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ కన్వీనర్ కంకట రత్న కుమార్, ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కోకన్వీనర్ గాలింకి ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ట్రస్టు ఆసుపత్రిలో కంటి పరీక్షలు

పెంటపాడు: అలంపురం వెంకటరమణ ఉచిత సేవా ఆసుపత్రిలో ఈనెల 17,18 తేదీల్లో కంటి పరీక్షలు చేయనున్నట్లు ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు కొలనువాడ పెదకృష్ణంరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం2 గంటల వరకు ఈ శిబిరాన్ని నిర్వహిస్తామన్నారు. కంటి సమస్యలు ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అవసరమైన వారికి రాయితీపై కళ్లజోళ్లు అందించనున్నట్లు పెదకృష్ణంరాజు తెలిపారు.

ముత్యాలమ్మకు వెండి బహూకరణ



ముత్యాలమ్మ వారికి వెండిని అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ముత్యాలంబాపురం శ్రీముత్యాలమ్మ వారి దేవస్థానానికి తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన కంచర్ల వెంకటసూర్యనారాయణ –రత్నమునెమ్మ దంపతులు పావు కిలో వెండిని శుక్రవారం సమర్పించారు. అమ్మవారి వెండి చీర నిమిత్తం ఈ వెండిని అందజేసినట్లు తెలిపారు. అలాగే ఉప్పాకపాడు గ్రామానికి చెందిన మారిశెట్టి వీరవెంకయ్య – జ్యోతి, అమ్మ మణి దంపతులు మరో 116 గ్రాముల వెండిని అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ అర్చకులు వేదాశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మాకా బాలాజీ, ఆలయ కార్యనిర్వహణ అధికారి పి.హరేరామ్‌ప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ హరిబాబు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

పశువైద్య సేవలు రైతులు వినియోగించుకోవాలి



పెంటపాడులో సంచార వాహనంలో సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అధికారులు

పెంటపాడు: వైఎస్సార్ సంచార పశు ఆరోగ్యసేవ (కాల్ 1962) పథకం ప్రతీ రైతు సద్వినియోగం చేసుకొనేలా సిబ్బంది పూర్తి ప్రచారం చేయాలని ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంచార ఆరోగ్యసేవ సంస్థ వాహనాల ఉమ్మడి జిల్లా మేనేజర్ పి. శివతేజ పేర్కొన్నారు. గత రెండు రోజుల నుంచి సంచార పశుఆరోగ్యసేవ వాహనాలు తనిఖీలో భాగంగా గూడెం, ఉంగుటూరు వాహనాలను తనిఖీ చేశారు. ఈ వాహనాలలో ఉన్న మెడికల్ పరికరాలు, మందులను పరిశీలించారు. వాహనాలు ఆయా ప్రాంతాలకు తిరిగిన సందర్భంలో ఖర్చు అయ్యే ఇందనం వినియోగంపై ఆరా తీసారు. సిబ్బందికి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆకాష్ చటర్జీ, పారావెట్ దుర్గాప్రసాద్, పైలెట్ శివకుమార్ తదితరులతో జిల్లా మేనేజర్ మాట్లాడుతూ వచ్చే వర్షాకాల సీజన్‌లో ప్రధానంగా పశువులు వ్యాధులకు గురౌతాయని వాటి విషయంలో జాగ్రత్తలు పాటించి, తక్షణం వైద్యం అందించేలా రైతులకు అందుబాటులో ఉండాలని ఆయన కోరారు.

డ్రై డేతో దోమల నివారణ



తణుకులో ఫైలేరియా బాధితులకు కిట్స్ పంపిణీ చేస్తున్న శ్రీనివాసరావు తదితరులు

తణుకు అర్బన్: వారానికి ఒకసారి డ్రై డే పాటించడం ద్వారా దోమల నివారణ సాధ్యమవుతుందని జిల్లా అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ పి.శ్రీనివాసరావు అన్నారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలోని వెంకటరాయపురం సచివాలయ పరిధిలో శుక్రవారం నిర్వహించిన డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇంటి పరిసరాల్లో ఉండే చిన్న నీటి నిల్వలు దోమల పుట్టుకకు ప్రధాన కారకాలని అన్నారు. నీటిని నిల్వచేసే వాటిపై తప్పని సరిగా మూతలు వేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న ఫైలేరియా బాధితులకు మార్బ్ డిటీ మేనేజ్‌మెంట్ డిజబిలిటీ ప్రీవెన్షన్ కిట్స్ అందచేశారు. ఈ కార్యక్రమంలో వెక్టార్ బోర్న్ డీసీజెస్ కంట్రోల్ సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు, ఫైలేరియా యూనిట్ హెల్త్ సూపర్‌వైజర్ కె.సత్యనారాయణ, హెల్త్ సెక్రటరీ డి.మంజుల, శానిటేషన్ సెక్రటరీ రాజు, హెల్త్ అసిస్టెంట్ ఎస్.తాతాజీ, ఆశ కార్యకర్త పి.మౌనిక, వలంటీరు ఎస్.వరలక్ష్మి పాల్గొన్నారు.

ప్రచండ భానుడి భగభగలు

- పెరిగిపోతున్న ఉష్ణోగ్రతలు
- అల్లాడిపోతున్న ప్రజలు
- నిర్మానుష్యంగా రహదారులు



ప్రత్తిపాడు వద్ద జాతీయ రహదారి నిర్మానుష్యంగా మారిన దృశ్యం

పెంటపాడు: రోహిణీ కార్తె పూర్తి కావస్తున్నా సూర్యుడు భగభగలు తగ్గలేదు. ఏకంగా 43 డిగ్రీల ఉష్ణోగ్రత కొన సాగుతుండడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉదయం 8 గంటల నుంచే సూర్యుడు ప్రతాపం చూపిస్తుండడంతో ప్రజలు ఇళ్లకే పరిమితం అవుతున్నారు. రోహిణీ కార్తె అఖరులో నైనా ఉష్ణోగ్రతలు తగ్గుతాయని ఎదురు చూపులు చూస్తున్నా వారి ఆశలు మాత్రం నెరవేరడం లేదు. మధ్యాహ్నమయ్యే సరికి రహదారులన్నీ నిర్మానుష్యంగా మారిపోతున్నాయి. దాహార్తిని తీర్చడానికి స్వచ్ఛంద సంస్థలు చలివేంద్రాలు ఏర్పాటు చేసినా గంటలోనే నిండుకుంటున్నాయి. దుకాణదారులు 12 గంటలకు సర్దేసుకొని తిరిగి సాయంత్రం 5 గంటలకు గాని తెరవలేకపోతున్నారు. ఉక్కబోత ఎక్కువగా ఉండడంతో తొల కరి చినుకులు కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు.

డీఈఓకు ఎస్ఎఫ్ఐ నాయకుల వినతి

సాక్షి, భీమవరం: జిల్లాలోని కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదని ఎస్ఎఫ్ఐ నాయకులు జిల్లా విద్యాశాఖాధికారిని కోరారు. శుక్రవారం విద్యాశాఖా కార్యాలయంలో డీఈవో ఆర్ వెంకటరమణకు వినతిపత్రం అందజేశారు.

నాలుగేళ్లుగా సంక్షేమంతో ఆదుకుంటున్నాం

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



అత్తిలి మండలం కొమ్మరలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

అత్తిలి: ఎన్నికల ముందు పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు నవరత్నాలు, సంక్షేమ పథకాలు అమలులోకి తీసుకువచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్లుగా వాటిని అమలు చేస్తున్నారని పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పేర్కొన్నారు. అత్తిలి మండలం కొమ్మర, ఈడూరు గ్రామాల్లో శుక్రవారం రాత్రి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో మంత్రి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ జనసేనపార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ప్రభుత్వ వ్యతిరేక ఓటుని చీలనివ్వనని ప్రగల్భాలు పలుకుతున్నారని, అయితే సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వ్యతిరేక ఓటు అనేది లేదన్నారు. గతంలో వైఎస్సార్‌సీపీకి ఓటు వేయనివారు కూడా తమ ప్రభుత్వం నుంచి లబ్ధిని పొందడంతో కృతజ్ఞతాభావంగా రానున్న ఎన్నికలలో వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేయడానికి కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. కొమ్మర గ్రామంలో నాలుగేళ్లకాలంలో రూ. 19.38 కోట్లతో సంక్షేమ, అభివృద్ధి పథకాలకు వెచ్చిస్తే, గత టీడీపీ ఐదేళ్ల కాలంలో కేవలం రూ. 1.35 కోట్లు వెచ్చించిందన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీనాయకులు, కార్యకర్తలు, గృహసారథులు సమన్వయంతో పనిచేసి, తిరిగి అధికారం చేపట్టేవిధంగా ఇప్పటి నుంచే శక్తివంచన లేకుండా కృషిచేయాలని కోరారు. ఈసందర్భంగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావుని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్ధరాతి భరణీ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, జడ్పీటీసీ సభ్యురాలు అడ్డాల జానకి, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, వైస్ ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు, జడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, సర్పంచ్‌లు మంతెన రామసీత, మంతెన రామరాజు, ఉపసర్పంచ్‌లు మన్యం దానారావు, మద్దాల శ్రీనివాస్,మాజీ ఏఎంసీ చైర్మన్ కూనపరెడ్డి జయరాజు, సొసైటీ అధ్యక్షుడు కునాధరాజు శ్రీహరి రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి వెలగల అమ్మిరెడ్డి, ఎస్సీసెల్ అధ్యక్షుడు కోరుకొల్లు వెంకట్రావు, వైఎస్సార్‌సీపీ నాయకులు సత్తి గణేష్‌రెడ్డి, దారాబత్తుల రామాంజనేయులు, సత్తి వెంకట శ్రీనివాసరెడ్డి, అడ్డాల వెంకటరత్నంబాబు, సత్తిసుబ్బిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.